క్లుప్తంగా

ఉరుసు ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా విరాజిల్లుతున్న కడప అమీన్‌పీర్ దర్గాలో ఈనెల 16వ తేదీ నుంచి జరిగే ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనాలని దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను ఆహ్వానించారు. సోమవారం పీఠాధిపతి కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి ఉరుసు నిర్వహణ గురించి వివరించారు. దర్గా ముజావర్ అమీర్, దర్గా ప్రతినిధులు పాల్గొన్నారు.

పగిలిపోయిన ప్రధాన పైపులైన్



బైపాస్‌లో పైపులైన్ పగిలిపోవడం వల్ల వృథా అవుతున్న తాగునీరు

కడప కార్పొరేషన్ : కడప నగరానికి తాగునీటిని అందించే ప్రధాన పైపులైన్ పగిలిపోయింది. బండి కనుమ నుంచి కడప నగరానికి వచ్చే ఈ పైపులైన్ కడప–తిరుపతి రోడ్డులో బైపాస్‌లో పెట్రోల్ బంకు ఎదురుగా గ్యాస్ పైపులైన్ పనుల వల్ల దెబ్బతింది. దీంతో నీరు రోడ్డు పక్కన వృథాగా ప్రవహిస్తున్నాయి. వారం రోజులకు పైగా ఇలా నీరు వృథా అవుతున్నా అటు గ్యాస్ పైపులైన్ కాంట్రాక్టర్‌గానీ, కార్పొరేషన్ అధికారులుగానీ పట్టించుకోలేదు. దీంతో ప్రయాణీకులతోపాటు, వ్యాపారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఈ పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

చదువు ప్రాముఖ్యతను గుర్తించాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవడంతోపాటు చదువు ప్రాముఖ్యతను గుర్తించాలని ఏసీడీసీఓ ఎం.శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దీప, నాగరత్న తెలిపారు. సోమవారం సాయిపేట పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కిశోరి వికాసం గురించి వివరించారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతుంటే 100, 1098, 181 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ సిబ్బంది లక్ష్మి ప్రసన్న, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినికి 'బాసట' సాయం



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న బాసట సంస్థ ప్రతినిధి బాలాజీరావు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతిభగల పేద విద్యార్థినికి ఆర్థికసాయం అందజేసింది. జిల్లా లోని ఒంటిమిట్ట మండలం కొండమాచుపల్లెకు చెందిన పుత్తా శివ హాసిని పదవ తరగతిలో 583 మార్కులు సాధించింది. తల్లి అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్మీడియేట్ చదివేందుకు సాయం కోసం బాసట సంస్థ అధ్యక్షులు వై.మంజులారెడ్డి ద్వారా ఎం.జయంతిని ఆశ్రయించారు. ఆమె కుమార్తె, అల్లుడు హర్షితా రెడ్డి, అఖిల్‌రెడ్డి స్పందించి రూ. 25 వేల చెక్కును బాసట సంస్థ ద్వారా శివ హాసినికి సోమవారం అందజేశారు.

విద్యుత్ భవన్ ఎదుట నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్ కొనుగోలు చార్జీలు, ఇంధన ధరల పెంపునకు నిరసనగా సోమవారం విద్యుత్ భవన్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పులివెందుల , ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 16 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి–7, టౌన్‌ప్లానింగ్–7, హెల్త్ విభాగం–1, యూపీఏ విభాగం–1 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, డిప్యూటీ కమిషనర్ రాంబాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నం పాల్గొన్నారు.

హరహర.. మహాదేవ..

భక్తిశ్రద్ధలతో కార్తిక రెండవ సోమవారం





మృత్యుంజయకుంట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కార్తికమాసం రెండవ సోమవారం కడప నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాల వద్ద తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు తెల్లవారుజామున 3 గంటల నుంచి అభిషేకాలు, అలంకారం నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఈ సందర్భంగా భక్తులు శివనామ స్మరణలు చేస్తూ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మొక్కులుగల వారు ఆలయాల ప్రాంగణాలలో ఉదయం, సాయంత్రం కార్తిక దీపాలను వెలిగించారు. కొందరు పిండి దీపాలు, మరికొందరు ఉసిరి దీపాలు, ఇతర ద్రవ్యాలతో ప్రమిదలు చేసి వెలిగించారు. మొక్కులుగల భక్తులు వెయ్యి, పది వేలు, అంతకుమించిన ఒత్తులతో అఖండ దీపాలను వెలిగించారు. నిర్వాహకులు దీపాలు వెలిగించేందుకు వచ్చిన భక్తుల కోసం బారికేడ్లు, షామియానాలు తదితరాలను ఏర్పాటు చేశారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్తిక మాసం రెండవ సోమవారం కావడంతో భక్తులు కొందరు సమీపంలోని అటవీ ప్రాంతాలకు, మామిడి తోటలు తదితర ప్రాంతాలకు వన భోజనాలకు తరలి వెళ్లారు.



ఆలయంలో భక్తుల సందడి

మేయర్‌ను విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : 30 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన మేయర్ సురేష్ బాబును విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, బీహెచ్ ఇలియాస్, బండి ప్రసాద్, కంచుపాటి బాబు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ మొదటి నుంచి వైఎస్ కుటుంబాన్ని నమ్ముకొని మేయర్ రాజకీయాలు చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీలో సర్పంచుగా, జెడ్పీ ఛైర్మెన్‌గా , జిల్లా అధ్యక్షుడిగా, వైఎస్సార్‌సీపీలో జిల్లా అధ్యక్షుడిగా, రెండు సార్లు మేయర్‌గా ప్రజా సేవలో ఉన్నారన్నారు. మేయర్ నాటకానికి తెరలేపారని టీడీపీ నాయకుడు బొమ్మిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. మున్సిపల్ మైదానంలో ఆయన ఏర్పాటు చేసిన 63వ స్టాల్‌ను అధికారులు తొలగిస్తే ఎవరు నాటకాలు, డ్రామాలు ఆడారో ప్రజలందరికీ తెలుసన్నారు. మేయర్ తన వద్దకు వచ్చిన వారికి కులమతాలు, పార్టీలు చూడకుండా సాయం చేస్తారన్నారు. అలాంటి నాయకుడిపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి బురదజల్లడం దారుణమన్నారు. దానిపై దేవునికడపలో ప్రమాణం చేద్దామని సవాల్ విసిరితే తోకముడిచి యూటర్న్ తీసుకున్నారన్నారు. కుర్చీ కోసం పాకులాడటం మానేసి కడపలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో చూపితే ప్రజల్లో మంచి పేరు వస్తుందన్నారు. కడప ఎమ్మెల్యే, ఆమె భర్త గూర్చి నగర ప్రజలు ఏమనుకుంటున్నారో ఏ టీ బంకు వద్దకు వెళ్లినా తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సాయిబాబా పాల్గొన్నారు.

శిల్పకారుడు జయన్నకు కేంద్ర మంత్రి ప్రశంసలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన ప్రముఖ శిల్ప, చిత్రకారుడు గొల్లపల్లి జయన్నకు కేంద్ర మంత్రి ప్రశంసలు లభించాయి. హైదరాబాదు కేంద్రీయ విద్యాలయలో చిత్ర, శిల్పకళా ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జయన్నకు రాష్ట్రీయ ఏక్తా పర్వ్–2024లో భాగంగా తిరుమల గిరి కేంద్రీయ విద్యాలయంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ శిల్పాన్ని రూపొందించి ప్రతిష్ఠించాలని కోరారు. స్పందించిన జయన్న వెంటనే పటేల్ కాంస్య విగ్రహాన్ని తయారు చేసి నిర్వాహకులకు అందజేశారు. సోమవారం కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్రీయ విద్యాలయాల కమిషనర్ నిధి పాండే తదితరులు ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిల్పకారుడు జయన్నను ఘనంగా సత్కరించారు. కడప కళాకారుడికి కేంద్ర మంత్రి ప్రశంసలు అందడం పట్ల జిల్లాలోని చిత్రకారులు హర్షం వ్యక్తం చేశారు.

ఖైదీల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి



మహిళా ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్తలు పాటించాలని, వారికి సక్రమంగా మందులను వాడేలా భోజన సదుపాయాలను ఎప్పటికప్పుడు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ తెలియజేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ కోసం 15100కు తెలియజేయాలన్నారు. ఖైదీల సమస్యలు ఏవైనా ఉంటే అర్జీల రూపంలో తీసుకుని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు పంపుతాన్నారు. మహిళా కారాగారాన్ని ఆయన సందర్శించారు. అక్కడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో జీవిత ఖైదీ ఆలమూరు శ్రీనివాసులు (సీటీ నెం.7792)కు చెవిటి మిషన్ కావాలని కోరగా, వెంటనే హియరింగ్ మిషన్‌ను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జడ్జి జె.నందిని, ట్రెనీ జడ్జిలు ఎస్.ఖాజా మైనుద్దీన్, ఎం.అనిల్‌కుమార్ నాయక్, ఎం.ఆశాప్రియ, కడప కేంద్ర కారాగార సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

హస్తకళల ప్రదర్శన ప్రారంభం

కడప కల్చరల్ : కడప నగరంలోని నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో సోమవారం కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాలు, హస్తకళల ప్రదర్శన, విక్రయాలు ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు సత్యనారాయణ మాట్లాడుతూ డిసెంబరు 1వ వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు.

రిజర్వేషన్ అమలు కావాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న కమిటీ నివేదిక వచ్చేవరకు డీఎస్సీ, ఇతర ఉద్యోగాల నియామకాలు చేపట్టకుండా ఆపాలని నవ్యాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు జి.జయరాజు కోరారు. సోమవారం ఆ సంఘ నాయకులు రాష్ట్ర పిలుపులో భాగంగా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. షెడ్యూల్ కులాలు, తెగల ఉప వర్గీకరణ న్యాయమైనదేనని, ఆయా రాష్ట్రాలు వర్గీకరణ చేసుకోవచ్చంటూ ఆగస్టు 1న సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు వర్గీకరణ అమలుపై స్పష్టమైన ప్రభుత్వ కార్యాచరణ ప్రకటించాలని కోరారు. భర్తీ చేయనున్న ఉద్యోగాల్లో సుప్రీం తీర్పును ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఓబులేశు, ఎం.కుళ్లాయప్ప, వై.రెడ్డెప్ప, శ్రీనివాసులు, కృష్ణకిశోర్, సుధాకర్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

కడప అర్బన్ : జిల్లాలో ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదు దారులతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

వీఆర్వో అక్రమాలపై విచారణ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం చిన్నచౌకు వీఆర్వో భాస్కర్‌రెడ్డి అక్రమాలపై విచారణ నిర్వహించి ఆయనను బదిలీ చేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు సోమవారం ఆర్డీఓ జాన్ ఎర్విన్‌ను కోరారు. పేదలు, దళితులు తమ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతుంటే వీఆర్వో తన కట్టుబడి పవన్‌ను వెంట పెట్టుకుని వచ్చి దౌర్జన్యంగా ఆపుతున్నారని ఆరోపించారు. శివరామిరెడ్డి తహసీల్దార్‌గా ఉన్న సమయంలో వీఆర్వో అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అవి నేటికీ కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ నారాయణ, టీడీపీ నాయకులు హరిప్రసాద్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు డబ్ల్యు రాము పాల్గొన్నారు.

అత్యంత కీలకం భూగర్భ జల అధ్యయనం



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ : భూగర్భ జల అధ్యయనానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు జరగనున్న భూగర్భ నీటి వనరుల సుస్థిరత – నిర్వహణపై శిక్షణా తరగతులను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాను రాను వర్షపాతం తగ్గుతోందని, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఇప్పుడు ఆలోచించకపోతే భవిష్యత్ పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. భూగర్భ జల అధ్యయనం, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కోర్సులకు మంచి అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశారు. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ రీజనల్ డైరెక్టర్ జి. కృష్ణమూర్తి స్వాగతోపన్యాసం చేస్తూ రాయలసీమలో భూగర్భ జల సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాము ఇచ్చే శిక్షణ ద్వారా భూమిలో గల భౌతిక రసాయనాలు, ఖనిజ లవణాల గురించి నేటితరం అవగాహన పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ మాట్లాడుతూ మానవ మనుగడ భూమిలో నీరు ఉన్నంతవరకే కొనసాగుతుందని, వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. నీటిని వృథా చేయకుండా రీసైక్లింగ్ రీయూజ్ విధానం చేయాల్సి ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి మాట్లాడుతూ కరువు ప్రాంతంలో ఇంకుడు గుంతలను నిర్మించాల్సి ఉందని తెలిపారు. ఎర్త్‌సైన్సెస్ విభాగాధిపతి ఆచార్య టి. శివప్రతాప్, జియాలజీ విభాగాధిపతి ఆచార్య కె.రఘుబాబు మాట్లాడారు. కార్యక్రమంలో భూగర్భజలశాఖ సిబ్బంది, వైవీయూ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవసమాజ నిర్మాణానికి కృషి చేయాలి

కడప ఆర్‌డీఓ జాన్ ఇర్విన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

వైవీయూ : ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన తెచ్చుకోవడంతో పాటు వారిపై జరుగుతున్న అరాచకాలను రూపుమాపి నవసమాజ నిర్మాణానికి కృషిచేయాలని కడప ఆర్‌డీఓ జాన్ ఇర్విన్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)లో సీఐడీ విభాగం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల సాధికారత, వారిపై అఘాయిత్యాల నివారణపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కడప ఆర్‌డీఓ మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. చట్టాలపై అవగాహన పొందడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవడంతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కడప నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, ఎస్సీ కార్పొరేషన్ డీడీ సరస్వతి చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కాంపిటీషన్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలాజీ, సుబ్బలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వివేకానంద స్వామి, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి, మహమ్మద్‌అలీఖాన్, సుబ్బలక్ష్మి, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంలో యువత ముందుండాలి



వైవీయూ : రక్తదానం చేస్తున్న పట్టుపోగుల సుబ్బారావు



కడప ఎడ్యుకేషన్ : మను కళాశాలలో రక్తదానం చేస్తున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : రక్తదానం చేయడంలో యువత ముందుండాలని సంగం డెంటల్ హాస్పిటల్ దంత వైద్యులు డాక్టర్ షేక్ నజీముద్దీన్ అన్నారు. సోమవారం మౌలానా ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కాలేజీలో కేకేఆర్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. కేకేఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తారిక్ అలి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విలయత్ అలి ఖైగ్, కో ఆర్డినేటర్ డాక్టర్ హకీముద్దీన్ పాల్గొన్నారు.

వైవీయూ : నగరంలోని హ్యాండ్స్ ఫర్ యు స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల సుబ్బారావు సంస్థ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని 32వ సారి రక్తదానం చేశారు. సోమవారం కడప నగరంలోని బృహద బ్లడ్ బ్యాంకులో రక్తదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా శ్రీపాలకొండ్రాయ దేవస్థానం చైర్మన్ రెడ్డయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఇసుక మాఫియాను అరికట్టాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఇసుక మాఫియాను అరికట్టి ఉచిత ఇసుక పాలసీని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రైవేటు ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మద్దిలేటి, రామాంజనేయులు, కె.లింగన్న డిమాండ్ చేశారు. ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలన్నారు. మెమో 1214ను తక్షణమే రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌ల పరిహారాలను వెంటనే కార్మికులకు చెల్లించాలని కోరారు. ప్రమాదాల్లో, అనారోగ్యాలతో చనిపోయిన కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించకుండానే సెస్సు రూపంలో వచ్చే డబ్బును కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయవచ్చన్నారు. నిర్మాణ రంగాన్ని గాడిలో పెట్టేందుకు సిమెంటు, ఐరన్, కలప, నిర్మాణ సామాగ్రి ధరలను తగ్గించాలన్నారు. రానున్న ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టే నిర్మాణాల్లో స్థానిక కార్మికులకే పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీరాములు, చాన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువలకు మరమ్మతులు చేయండి

కడప కల్చరల్ : కడప నగరంలోని రామరాజుపల్లె పరిధిలోగల కృపా కాలనీ, బుడగజంగం కాలనీ, లోహియానగర్‌లోని డ్రైనేజీ కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని 48వ డివిజన్ కృపాకాలనీకి చెందిన న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, బుడగజంగం నాయకులు రాజేష్, శ్రీరాములు మున్సిపల్ కమిషర్ మనోజ్‌రెడ్డిని కోరారు. సోమవారం ఈ మేరకు వారు సంస్థ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

విద్యారంగానికి కలాం సేవలు చిరస్మరణీయం



వైవీయూ: డా. వీరభద్రయ్యను సత్కరిస్తున్న మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు



ఏఎఫ్‌యూ: డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో మౌలానా ఆజాద్ జయంతి వేడుకల్లో వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్ తదితరులు



కడప కల్చరల్ : అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పిచ్చయ్యచౌదరి తదితరులు



వైవీయూ : మౌలాన అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్

వైవీయూ : స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు ఆదర్శనీయమని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. డాక్టర్ మౌలానా అబుల్ కలాం జయంతి రామన్ సెమినార్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి తదితరులు మౌలానా అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీసీ మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యా వ్యవస్థను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆచార్య పి. పద్మ మాట్లాడుతూ జాతీయ విద్యా దినోత్సవం 2024 థీమ్ గా పీస్ అండ్ డెవలప్మెంట్ అనే శీర్షికను నిర్ణయించారన్నారు. హ్యూమానిటీస్ డీన్ ఆచార్య కంకణాల గంగయ్య విద్యారంగ చారిత్రక నేపథ్యం గురించి వివరించారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ మాజీ కుల సచివులు ఆచార్య మహమ్మద్ సిద్దిఖి 'సుస్థిర అభివృద్ధిలో విద్య పాత్ర' అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. షిల్లాంగ్ ఎన్ ఈ హెచ్ యు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. అమరేశ్వరన్ 'భవిష్యత్తు భారతావనిలో విద్య పాత్ర' అనే అంశంపై ఉపన్యసించారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూశాఖ విభాగాధిపతి డాక్టర్ రియాజున్నీసా, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మౌలానా ఆదర్శనీయుడు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అబుల్ కలాం ఆజాద్ ఆదర్శనీయుడని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో అబుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కడప కల్చరల్/ కడప ఎడ్యుకేషన్ : మౌలాన అబుల్ కలాం ఆజాద్ భారతదేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ అలపర్తి పిచ్చయ్య చౌదరి తెలిపారు. సోమవారం కడప నగరంలోని అల్మాస్‌పేటలోని ప్రధాన మంత్రి కౌశల్ కేంద్ర స్కిల్ డెవలప్మెంట్ ట్రెనింగ్ సెంటర్‌లో అబుల్ కలాం జయంతి ఉత్సవాలను నిర్వహించారు. మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ షబ్బీర్, స్కిల్ సెంటర్ మేనేజర్ ఎస్.కె అంజుమ్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో ఆజాద్ జయంతి

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన సేవలను గురించి వివరించారు. అనంతరం ఎస్వీయూ ఉర్దూ ప్రొఫెసర్ డా. ఎస్.ఎ. సత్తార్, కళాశాల సీనియర్ అధ్యాపకులు డా. వీరభద్రయ్యలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాయల్ కరీం అసోసియేషన్ రూపొందించిన మౌలాన అబుల్ కలాం ఆజాద్ చిత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉర్దూ విభాగాధిపతి డా. షాజియాబేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.